క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బంగారుపాళెం : మండలంలోని బోడబండ్ల గ్రామంలో విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌కో ఏడీ కొండయ్య శుక్రవారం పరిశీలించారు. ఇళ్లపైనే మృత్యుతీగలు శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏడీ మాట్లాడుతూ షిఫ్టింగ్ చార్జీలు చెల్లిస్తే స్తంభాలు, తీగలను వేరే చోటుకు మారుస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయా గృహ యజమానులకు నోటీసులు అందించినట్లు వెల్లడించారు. అలాగే ఎర్రాండ్లపల్లె, జయరామపురం, ముంగరమడుగు, జంబువారిపల్లెలో సైతం కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈ దేవీప్రసన్న, లైన్ ఇన్‌స్పెక్టర్ జానకిరామ్, లైన్‌మన్ సురేంద్ర పాల్గొన్నారు.

కోళ్లఫారాల్లో తనిఖీ



కిల్లారిపల్లెలో కోళ్లఫారాన్ని పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి

గుడిపాల: కోళ్ల ఫారాల్లో తనిఖీలు చేస్తున్నట్లు గుడిపాల పశు వైద్యాధికారి సాయిసుధ తెలిపారు. శుక్రవారం కిల్లారిపల్లె, చుక్కావారిపల్లె పౌల్ట్రీ ఫారాల్లో తనిఖీలు చేశారు. ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వైరస్ కారణంగా కోళ్లు చనిపోతున్నాయని, దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోళ్ల ఫారాలను తనిఖీ చేసి నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. కోళ్లకు అనారోగ్యం ఉన్నట్లు అనుమానం వస్తే తక్షణమే డాక్టర్లకు తెలియజేయాలన్నారు. అనారోగ్యంతో అవి చనిపోతే బహిరంగ ప్రాంతంలో వేయకుండా, గుంతలు తీసి పూడ్చి వేయాలన్నారు.

రక్షణ కల్పించాలని వినతి



మాట్లాడుతున్న ప్రేమజంట

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రేమించి...పెళ్లి చేసుకున్నామని, తమ కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట విన్నవించింది. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వెదురుకుప్పం మండలం పెద్దపోడిచేను గ్రామానికి చెందిన యువతి మాట్లాడుతూ కార్వేటినగరం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పవన్‌ను కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నట్లు వెల్లడించింది. ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవడంతో పవన్‌ను పెళ్లి చేసుకునేందుకు ఇష్టపూర్వకంగా బయటకు వచ్చేసినట్లు తెలిపింది. మూడు రోజులకు క్రితం వివాహం చేసుకున్నామని, తమ కుటుంబీకుల నుంచి ప్రాణహాని ఉందని వివరించింది. ఈ మేరకు పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య బారిన పడరని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఐలవారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు విధిగా చేయించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో సుఖ ప్రసవాలు చేసుకోవడం తల్లీబిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ తప్పనిసరి



వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బంగారుపాళెం : వరి సాగులో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటించాలని చిత్తూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సంధారాణి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని చీకూరుపల్లెలో సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వరికి అధికంగా యూరియా వేస్తే తెగుళ్ల సోకే ప్రమాదముందన్నారు. వరిని ఆశించే అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 మిల్లీ గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. లేదా కాసుకామైసిన్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసినా ఫలితం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఏ నాగపద్మిని, ఏఈఓలు సాదరయ్య, మూర్తి పాల్గొన్నారు.

నేనే చైర్మన్.. నాదే పెత్తనం!



వరసిద్ధి వినాయకస్వామి ఆలయం

- కాణిపాకం ఆలయంలో 'మాజీ' జులుం
- కూటమి నేతల అండతో హల్‌చల్
- మింగలేక.. కక్కలేక అధికారుల అవస్థలు
- సదరు నాయకుడి తీరుపై భగ్గుమంటున్న మరో వర్గం

కాణిపాకంలో ఓ నేత నానా హంగామా చేస్తున్నారు. గతంలో ఆలయ కమిటీ చైర్మన్ చక్రం తిప్పిన అనుభవంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వరసిద్ధుని సన్నిధిలో అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. అన్ని విషయాల్లో తగుదునమ్మా అంటూ వేలు పెట్టేస్తున్నారు. కూటమి నాయకుల అండతో ప్రతి ఒక్కరినీ బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఆలయ కమిటీకి నేనే చైర్మన్.. ఇకపై నాదే పెత్తనం అంటూ దబాయించి పనులు చేయించుకుంటున్నారు. ఆయన వైఖరిపై అదే పార్టీలోని మరో వర్గం వారు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే అధికారులు సైతం మింగలేక.. కక్కలేక నానా అవస్థలు పడుతున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. రూ.కోట్ల కానుకలు సమర్పిస్తుంటారు. ప్రస్తుతం కేవలం 20 రోజుల్లోనే హుండీ ద్వారా రూ.కోటికి పైగా ఆదాయం వస్తోంది. ఇక అన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50లక్షలకు పైగా విరాళాలు వస్తున్నాయి. ఇతరత్రా సేవల ద్వారా రూ.లక్షల్లో రాబడి ఉంటోంది. ఈ క్రమంలో ఆలయ కమిటీలో స్థానం కోసం పెద్దసంఖ్యలో నేతలు పోటీ పడుతుంటారు. ముఖ్యంగా చైర్మన్ పదవికి పోటీ గట్టిగానే ఉంటుంది.

కూటమి అధికారంలోకి రాగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి వరకు చైర్మన్‌గా ఉన్న వ్యక్తి రాజీనామా చేశారు. ఆ తర్వాత చైర్మన్ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రసుత్తం ఈ పోస్టుకు గతంలో చైర్మన్ ఉన్న వ్యక్తి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలి భర్త, మాజీ సర్పంచ్ మధ్య తీవ్రమైన పోటీ ఉంది. పదవి కోసం నువ్వా..నేనా అంటూ కుస్తీ పడుతున్నారు. ఈపోటీలో మాజీ చైర్మన్‌గా ఉన్న ఓ వ్యక్తి తానే కాబోయే చైర్మన్ అంటూ జోరుగా ప్రచారం చేయించుకుంటున్నారు. ఆయనకు ఓ ప్రజాప్రతినిధి సైతం వంత పాడారు. చైర్మన్ పదవి ఆయనదే అని అనధికారికంగా ప్రకటించేశారు. దీంతో అధికారురులు సైతం సదరు మాజీనే కాబోయే చైర్మన్ అని భావించారు. దీంతో ఆలయంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి పిలుపు పంపుతున్నారు. ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి మరీ సదరు మాజీ ఆదేశాలకు జీ హుజూర్ అంటున్నారు. దీంతో ఆయనకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చివరకు ఆలయ పవిత్రతను దెబ్బతీసేందుకు కూడా వెనుకాడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు.

సిఫార్సు చేస్తే ఉచితమే..

సదరు మాజీ చైర్మన్ సిఫార్సుతో ఆలయంలో చకచక గేటు తెరిచేస్తున్నారు. వచ్చిన వారిని ఉచితంగా స్వామివారి సేవలకు అనుమతిస్తున్నారు. అంతరాలయ దర్శనం సైతం చేయిస్తున్నారు. వేద పండితుల ఆశీర్వచనాలు కూడా అందిస్తున్నారు. అవసరమైతే గెస్ట్‌హౌస్‌లో సకల వసతులు కల్పించేస్తున్నారు. దీంతో ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. సాధారణ ఆశీర్వచనానికి రూ. 500, ప్రత్యేక ఆశీర్వచనానికి భక్తులు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. అయితే అవన్నీ మాజీ సిఫార్సు మేరకు ఉచితంగానే చేయించేస్తున్నారు. చివరకు అతిథిగృహంలో రూమ్‌లను సైతం ఫ్రీగానే కేటాయిస్తున్నట్లు సమాచారం.

భయాందోళనలో సిబ్బంది

కూటమి అధికారం చేపట్టిన కొద్ది కాలంలోనే కాణిపాకం ఆలయంలో పలువురు ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ రంగు పులిమి బదిలీ వేటు వేశారు. కొందరిని కుర్చీలకే పరిమితం చేశారు. ఇవన్నీ ఆ మాజీ చేతుల మీదుగానే జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు బిల్లులు కూడా ఆయన ఆజ్ఞ లేనిదే మంజూరు కావడం లేదని ఆరోపనలు వెలువెత్తుతున్నాయి. మాజీ చెప్పిన పనులు చేయకపోతే అంతు చూస్తామని బెదిరింపులు ఆలయ సిబ్బందికి పరిపాటిగా మారిపోయింది. మాజీ పెత్తనం భరించలేని స్థితికి చేరిందని ఆలయ అధికారులు, సిబ్బంది బహిరంగంగానే వాపోతున్నారు.

వ్యతిరేకిస్తున్న మరో వర్గం

ఆ మాజీ చైర్మన్ వ్యవహార శైలిపై కూటమిలోని మరోవర్గం భగ్గుమంటోంది. ప్రత్యేక పూజలు, సేవల్లో ఆ మాజీకి ఎందుకు అంతటి ప్రాధాన్యమిస్తున్నారని మండిపడుతోంది. చైర్మన్ నేనే అంటే అన్నీ ఉచితంగా చేయిస్తారా అంటూ ప్రశ్నిస్తోంది. పవిత్రమైన ఆలయంలో రాజకీయాలు చేయడం తగదని విమర్శిస్తోంది. దీనిపై మంత్రులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వెల్లడిస్తోంది. అలాంటి వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెడితే పార్టీ పరువును గంగలో కలిపేస్తారని స్పష్టం చేస్తోంది.

లక్ష్యాల మేరకు సబ్సిడీ రుణాలు

చిత్తూరు అర్బన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు మంజూరు చేయాలని కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ కోరారు. సబ్సిడీ రుణాల మంజూరు అంశాలపై శుక్రవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో నగరపాలక సంస్థ పరిధిలోని 35 బ్యాంకుల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కమిషనర్ మాట్లాడారు. వార్డు సచివాలయాల ద్వారా సబ్సిడీ రుణాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వీటిని బ్యాంకులకు పంపుతామన్నారు. దరఖాస్తుదారులతో ఇంటర్వ్యూలు నిర్వహించి రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, సీఎంఎం వెంకటరమణ, అధికారులు, సీఓలు పాల్గొన్నారు.

భూముల వివరాలు రైతులు నమోదు చేసుకోవాలి

ఐరాల: మండలంలోని రైతులు ఆంధ్రప్రదేశ్ ఫార్మల్ రిజిస్ట్రీ పోర్టల్(ఏపీ ఎఎఫ్‌ఆర్)లో వారి భూముల వివరాలు నమోదు చేసుకోవాలని ఏఓ వరలక్ష్మి కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, రైతులు ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నపుడు వారికి 16 నంబర్ల ఒక ఐడీ నంబర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఐడీ నంబర్ పొందిన రైతులు మాత్రమే ప్రభుత్వం నుంచి సబ్సిడీ పథకాలు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ పథకం వంటివి పొందడానికి వీలవుతుందన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగల్, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ శ్రీధర్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలో కొంగారెడ్డిపల్లెలోని విజ్ఞాన సుధ జూనియర్ కళాశాల 5 వ వార్షికోత్సవం శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ శ్రీధర్ మాట్లాడారు. పరీక్షల సమయంలో సామాజిక మాధ్యమాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సబ్జెక్టుల వారీగా ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలను పొందవచ్చన్నారు. అనంతరం పలు క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు కేటాయించకపోతే పోరాటం



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించకపోతే పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ హెచ్చరించారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధిదారుల నుంచి రూ.500, రూ.50,000, లక్ష చొప్పున డిపాజిట్లు సేకరించారన్నారు. బ్యాంకు ద్వారా ఆ మొత్తాన్ని సేకరించి గృహాలు కేటాయిస్తామని చెప్పి ఎంతో కాలమైనా ఇప్పటి వరకూ ఇవ్వకపోవడం శోచనీయమని విమర్శించారు. మాటల్లో గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వం వాటిని చేతల్లో చూపాలన్నారు. డిపాజిట్ చెల్లించిన లబ్ధిదారుల జాబితాలను తారుమారు చేయకుండా పారదర్శకంగా వారికే గృహాలను ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, మణి, విజయగౌరి, కుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

పూత పూసింది..మోము విరిసింది



మామిడి తోటల్లో పూసిన పూత

సదుం: నియోజకవర్గంలోని ప్రధాన పంటల్లో మామిడి ఒక్కటి. చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలల్లో సుమారు 30 వేల ఎకరాలల్లో మామిడి సాగులో ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో జనవరిలో సైతం పూత రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఈసారి నష్టాలు తప్పేలా లేవని భావించారు. కానీ ప్రస్తుతం మారిన వాతావరణంతో తోటలలో పూత విరబూయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 80 శాతం తోటలలో పూత వచ్చిందని ఉద్యానవన శాఖ అధికారిణి సంతోషి కుమారి తెలిపారు. పూత బాగుండడం, పరిస్థితులు ఇలాగే అనుకూలిస్తే ఎకరాకు నాలుగు టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆమె చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు నగరంలోని గిరింపేట, మిట్టూరుతోపాటు యాదమరి, బంగారుపాళెం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో విద్యుత్ ఉండదని తెలియజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 17 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మందికి రూ.1.70 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాల తనిఖీలో మొత్తం 17 మంది మద్యం సేవించి నడుపుతున్నట్టు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. కోర్టుకు హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

నంగమంగళంలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మండలంలోని నంగమంగళంలో శుక్రవారం డాక్టర్ అనూష ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులు, గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పవిత్ర, శ్రీలత, సరిత, రూబి, వరలక్ష్మి పాల్గొన్నారు.

10న 'నులి'మేద్దాం



అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి మాత్రలను అందజేస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్



గుడిపాల: పోస్టరు ఆవిష్కరించి మాత్రలను ఎంపీడీఓకు అందజేస్తున్న వైద్యసిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. శుక్రవారం పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విధిగా పిల్లలు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని, 10వ తేదీ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోని వారికి 17వ తేదీన ఇవ్వాలన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం ఆ పాఠశాల హెచ్‌ఎం పూర్వాణికి ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: ఈనెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతంగా చేయాలని ఎంపీడీఓ శివరాజన్ ఆదేశించారు. శుక్రవారం గుడిపాల, బొమ్మసముద్రం డాక్టర్లు సంధ్య, చంద్ర మహేష్, అనూష ఎంపీడీఓకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కలిపి మొత్తం 5,950 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికీ మాత్రలు వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం మాత్రలను ఎంఈఓ గణపతి ద్వారా ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలన్నారు. ఎంపీహెచ్‌ఓ భానుప్రకాష్, సిబ్బంది విజయ, చంద్రశేఖర్, అనురాధ, రుక్మిణి, శశి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

– ఐసీడీఎస్ పీడీ వేంకటేశ్వరి



రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీ వేంకటేశ్వరి

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐసీడీఎస్ పీడీ వేంకటేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో 363 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలుసుకున్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి వారిపై ప్రత్యేకశ్రద్ధ వహించి విద్యాబోధన చేయాలన్నారు. లో మధ్యాహ్న భోజనం ఎలా ఉందో ఆరా తీశారు. ఆకుకూర పప్పు, అన్నం తిన్నట్టు విద్యార్థులు ఆమెకు చెప్పారు. పాఠశాలలో నాడు–నేడు పథకంలో జరుగుతున్న తరగతి గదుల పనులు నిలిచి పోయాయని పీడీ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకువచ్చారు. అనంతరం రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఫజులుపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది డాక్టర్లు ఉన్నారో ఆరా తీశారు. మహిళలకు వైద్య పరీక్షలు చేయడానికి మహిళా డాక్టర్ లేక పోతే ఎలా? అని ప్రశ్నించారు. స్టాఫ్ నర్సు ద్వారా పరీక్షలు చేయిస్తున్నట్టు వైద్యులు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇందిర, డాక్టర్ వినయ్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచు కురిసె.. మనసు మురిసె!



ముంగరమడుగు చెరువు సమీపంలో..

బంగారుపాళెం మండలంలోని పల్లెసీమలను దట్టమైన పొగ మంచు శుక్రవారం కమ్మేసింది. కనువిందుగా ఆవిష్కృతమైన దృశ్యాలను వీక్షించిన ప్రజల మనసు మురిసింది. చిరుజల్లులా కురుస్తున్న హిమపాతంతో ప్రకృతి ప్రేమికుల మది పులకించింది. ఉదయం 9 గంటలు దాటినా భానుడికి ముఖం చాటేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జాతీయ రహదారిపై లైట్లు వేసుకునే వాహనాలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

– బంగారుపాళెం



రహదారిని కమ్మేసిన మంచు



మొగిలి వెంకటగిరి రామాలయంపై మంచుతెర

పంటలపై ఏనుగుల దాడి



తవణంపల్లె: మండలంలోని మాధవరం సమీపంలోని పంటలపై ఏనుగులు దాడి చేశాయి. మాధవరం గ్రామానికి చెందిన రవికుమార్‌రెడ్డి పొలంలో మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన చెన్నప్ప పొలంలో మామిడి, అరటి, కొబ్బరి చెట్లను నాశనం చేశాయి. అలాగే బ్రహ్మానందరెడ్డి పొలంలో మామిడి చెట్లను విరిచి రాతి కూసాలను కూలదోశాయి. అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

16న వాలీబాల్ టోర్నీ

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఈనెల 16న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి వరుసగా రూ.50,116, రూ. 30,116, రూ. 20,116. రూ.10,116 ఇవ్వనున్నట్లు చెప్పారు. రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించాలని, క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 9908585899, 9703226723, 9160988254 నంబర్లను సంప్రదించాలన్నారు.